# 7

## కాకీ డ్రస్సు

నెలకు ఐదు రూపాయలే? అంటే యిరవై పావలాలు. అబ్బే యిరవయ్యేమిటి? ఎనభై అణాలు. ఆ లెక్కన సంవత్సరానికి? అబ్బో! అంత పెద్ద లెక్క తనకు రాదు. కాని బోలెడన్ని డబ్బులు!

డ్రస్సుకూడా యిస్తారట. ఆ 'కాకీడ్రస్సు'ల్లో ఒక చిన్న పోలీసులాగ ఎంత చక్కగా తిరుగుతాడు! అప్పుడు ఆ తంగవేలు తన్ను చూసి బలేగా ఏడుస్తాడులే. తనకు ఐదు రూపాయలు జీతం పెరిగినట్లు విని ఇంకా వుడుక్కు చస్తాడు. వాడితిక్క అలాగే కుదరాలి. లేకపోతే తనకేగాక రెండు రూపాయల జీతం ఎక్కువని ఎంత మిడిసిపడేవాడు? తనకే గనక ఒక జత ఎక్కువ గుడ్డ లున్నవని, తన గుడ్డలవంక చూస్తూ, ఎగతాళిగా నొసలు ఎగరేస్తూ పోతాడు. నాలా, అసలు నిజంగా మాట్లాడితే తన కున్నది ఒక్కజతే ఐనా వాడికంటే శుభ్రంగానే వుండేవి. రోజూ రాత్రిపూట తన గుడ్డలను ఎంతో శుభ్రంగా వుతుకుతుంది అమ్మ.

యిక వాడిని తప్పుకు తిరగవలసిన పనిలేదు. దర్జాగా ఓ బుల్లి పోలీసు లాగ వాడిముందుగా తలెత్తుకుని నడుస్తాడు. అప్పుడు చూడాలి వాడి జిడ్డు ముఖం పోకు. ఇంకొంచెం జిడ్డుగా తయారవుతుంది.

అసలు కాకీడ్రస్సు అంటే చిన్నప్పటినుండి తనకు బలే యిష్టం. ఆ డ్రస్సులో వున్న వాళ్ళను చూస్తే తనను తన్ను మరిచిపోయి, నోరు తెరుచుకుని నిలబడిపోయేవాడు. యికనుండి తనుకూడ ఆ డ్రస్సులో దర్జాగా, మారాజు బిడ్డలాగ నడుస్తాడు.

ఐదు రూపాయలు జీతం పెరిగిన సంగతి విని, అమ్మ ఎంత సంబర పడుతుంది! చిన్నోడు పాలులేక ఎండిపోతున్నాడని అమ్మ ఏడవని రోజు వుండదు. నాన్నదగ్గర పోరు పెడుతుంది. నాన్నకు అసలే కోపం. ఎప్పుడు చూసినా రుస రుస లాడుతూనే వుంటాడు. 'చస్తే చావనియ్యి. మనలాంటి

వాళ్ళు చస్తే భూభారం తగ్గుతుంది' అంటాడు. అంతతో అమ్మకు కోపం వస్తుంది. యింకేం తిట్లకు లంకించుకుంటుంది. నాన్నను ఎందుకూ పనికిరాని అంటు వెధవ కింద కట్టేస్తుంది. దాంతో నాన్న అమ్మజుట్టును లంకించుకుని కొట్టటం ప్రారంభిస్తాడు. తన తమ్ములూ, చెల్లెళ్ళూ తలోక చోటున 'ఘొల్లు' మంటారు. అది చూస్తున్న తన రక్తం వేడెక్కిపోతుంది. నాన్నమీద కలియబడి తన చిన్న చేతులతో కొట్టటం ప్రారంభిస్తాడు. కాని నాన్న తన్ను, వంటిమీద పాకుతున్న పురుగును విదిలించినంత తేలిగ్గా విదిలించేస్తాడు. ఆ తోపుకు అంత దూరంపోయి పడి, చివరకు చేసేదేమీ లేక తనూ ఏడుపు ప్రారంభిస్తాడు.

అందుకే తనకు నాన్నముఖం చూడటమంటేనే అసహ్యం. ఎప్పుడూ ఆ ముఖంమీద 'వడ్లగింజ వేస్తే పేలగింజ వేగుతుంది.'

అమ్మ ఎంత మంచిది! యింతా చేసి చివరకు నాన్న అన్నం తినేవరకు తనూ తినదు. అందరకూ పెట్టి మిగిల్తే యింత తింటుంది. లేకపోతే అదీ లేదు. అలాంటి అమ్మనుకొట్టే నాన్ననుచూస్తే నమిలి మింగుదామా అన్నంత కోపం వస్తుంది. తను యింకొంచెం పెద్దయాక కాని నాన్నపగ్గం పట్టడు.

తన యీ ఐదు రూపాయల సంగతి నాన్నకు చెప్పకూడదు. అమ్మకే రహస్యంగా చెప్పాలి. నాన్న సంపాదన ఏమీ లేకపోగా, తాగటానికి డబ్బులు కావాలంటూ అమ్మను పీక్కుతింటాడు. అమ్మ యివ్వదు. అసలు అమ్మదగ్గర వుంటేగదూ ఇవ్వటానికి? దాంతో అమ్మకు నాన్న చేత దెబ్బలు.

ఒకోరోజు నాన్న నిద్రపోయేటప్పుడు తల పగలకొడదామా అనిపిస్తుంది తనకు. అమ్మో! అలాగయితే అమ్మకూడ చచ్చిపోదూ? అసలు అమ్మకోసమేకదా యిదంతా తను ఆలోచించేది?

నాన్నకూడ మొదట మంచివాడే. ట్రాములో కండక్టరుగా పనిచేసేవాడు. ఎప్పుడూ అమ్మతో నవ్వుతూ, సరసాలాడుతూ వుండేవాడు. పిల్లలంటే కూడా ఎంత ప్రేమ? యెంత ప్రొద్దుపోయినా ఏదో ఒక చిరుతిండి తెచ్చి పెట్టేవాడు. నిద్రపోయే పిల్లల్ని లేపి తినిపించిగాని తను అన్నం తినేవాడు కాదు. ఇప్పుడు ఆ ట్రాములు ఆగటంతో పాటు నాన్న ఉద్యోగం కూడా ఊడింది.

ఉద్యోగం పోయి బాధపడే నాన్నను చూస్తే పిచ్చి యెక్కుతుందేమోననే భయం కలిగేది. అమ్మ రోజూ ఏడ్చేది నాన్న వాలకం చూస్తూ. రాత్రిళ్లు

కూడా యింటికి రాకుండా ఎక్కడెక్కడో తిరిగేవాడు. రెండు మూడు నెలలు కాలికి బలపం కట్టుకు తిరిగినా ఉద్యోగం యిచ్చే దాత కన్పించలా. చివరకు విసిగి ఉద్యోగ ప్రయత్నాలే మానుకున్నాడు.

ఆకలి మంటలతో నక నకలాడే బిడ్డలను చూడలేక అమ్మ చౌదరిగారింట్లో వంట మనిషిగా చేరింది. నెలకు ఇరవయ్యి రూపాయలిస్తారు. సుబ్బారావుగారి పుణ్యమా అంటూ తనకు యీ కంపెనీలో బంట్రోతు పని దొరికింది. అదయినా దొరికేది కాదేమో! అంతకు ముందు పనిచేసే బుడ్డోడు ఏదో దొంగతనం చేశాడట. వెంటనే వాడి ఉద్యోగం కాస్తా ఊడింది. ఆ ఆఫీసులోనే గుమాస్తాగా ఉండే సుబ్బారావు బాబుగారు తనకు ఆ నౌకరీ యిప్పించాడు.

తమ యిద్దరి జీతాలూ కలిపి కూడా నెలకు సగం రోజులు గడవటమే కష్టం. పైగా తాగుబోతు నాన్నను భరించాలి.

అసలు మొదట అమ్మే నాన్నను చెడగొట్టింది. దిగాలుపడి యింట్లో కూర్చున్న నాన్న చేతులో పావలా, పరకా పెట్టి బైటికి పంపేది. చివరకు నాన్న ఇలా తయారయ్యాడు. అమ్మ మాత్రం ఎన్ని రోజులు భరిస్తుంది—

యీ సోమరిపోతు నాన్నంటే ఆమెకూ ఓపిక చస్తున్న కొద్దీ కోపం ఎక్కువయింది. యింట్లో 'రామ రామ' ఒక్క నిమిషం ఉండబుద్ధి కాదు. ఎప్పుడూ కాట్లు కుక్కల్లాగ కసురుకోవటంతోటే సరిపోతుంది. ప్రొద్దుటి నుండీ పనిచేసి యింటికి ఏదో భయంతో బిక్కు బిక్కు మంటూనే చేరుకుంటాడు తను.

ఇలా ఆలోచనల్లో నిమగ్నుడై నడుస్తున్న కుప్పుస్వామి—

"ఏరోయ్! బలే ఉసారుగా నడుస్తుండావు! ఏం గిరాకి?" అన్న తంగవేలు మాటల్తో ఉలిక్కిపడ్డాడు.

"ఉద్యోగం ఎలిగిత్తుండావు గందా. పండక్కన్నా ఒక జత గుడ్డలు కుట్టించుకున్నావా?" అన్నాడు తంగవేలు కుప్పుస్వామి భుజాలు చిరిగిన షర్టునూ, నామమాత్రంగా ఉన్న చిరిగిన నిక్కరునూ శల్యపరీక్ష చేస్తూ.

కుప్పుస్వామికి బలే కోపం వచ్చింది. ఇంతకు ముందయితే వాడి మాటలు విని సిగ్గుపడేవాడు. కాని యీ రోజు వాడికంటే తన స్థితే మెరుగ్గా కనిపించింది కుప్పుస్వామికి. అందువల్లనే సిగ్గుకు మారుగా కోపం కలిగింది.

కళ్ళముందు కాకిడ్రస్సు కన్పిస్తుంది. కళ్ళలో ఆనందపు తళుకులు కదిలాయి. తంగవేలుతో ఆ విషయం చెప్పాలనుకున్నాడు. కాని వెంటనే ఒక ఉపాయం తట్టింది ఆ చిన్న బుర్రకు.

"ఛ, ఇప్పుడే చెప్పకూడదు. ఇంకా రెండు రోజులు పోయాక అకస్మాత్తుగా తన్ను ఆ డ్రస్సులో చూసి దిమ్మ తిరిగి క్రింద పడిపోయేంత పని జరుగుతుంది. అప్పుడు ఐదు రూపాయిల జీతం పెరుగుదలను గురించి కూడా చెప్పి వాడిని అలాగే అయోమయంలో వదిలేసి తను ఒకసారి గట్టిగా సకిలించి వెళ్లిపోతాను."

"ఏరోయ్! కళ్ళు నెత్తికొచ్చాయి లాగుందే? మాటాడకుండా పోతున్నావు నా...లా" అంటూ బూతులు తిడుతున్నా కూడా వినిపించనట్లూ ముందుకు సాగాడు కుప్పుస్వామి.

ఈ రోజు పదిహేను సంవత్సరాల కుప్పుస్వామి చిన్న బుర్రలో అన్ని ఆలోచనలు తల లెత్తటానికి బలీయమైన కారణమే ఉన్నది. మామూలు ప్రకారం చద్ది తిని కంపెనీకి వెళ్ళిన కుప్పుస్వామిని, పదిమందీ ఒక చోటున చేరి ఏదో 'సీరియస్'గా మాట్లాడుతున్న బంట్రోతుల ముఠా ఆకర్షించింది. అతన్ని కూడా వాళ్లు పిల్చి కూర్చోపెట్టారు.

రామస్వామి చేతిలో ఒక పెద్ద కాగితం ఉన్నది. అందులో ఏదో ఇంగ్లీషులో రాసి ఉన్నది. క్రింద కొన్ని సంతకాలూ, కొన్ని వేలు ముద్రలు ఉన్నవి. కుప్పుస్వామిని కూడా సంతకం చేయమన్నారు. కుప్పుస్వామి నాలుగో తరగతి వరకు చదువుకున్నాడు. విషయం తెలుసుకోకుండా సంతకం చేయటం మంచిది కాదనుకున్నాడు.

వాళ్లు దాన్ని గురించి ఇలా చెప్పారు. "దానిమీద సంతకం చేస్తే ఐదు రూపాయలు ఎక్కువ జీతం, డ్రస్సులూ ఇస్తారట కంపెనీవాళ్ళు."

కుప్పుస్వామికి వాళ్ళ మాటలమీద నమ్మకం కలగలేదు. కాగితంమీద సంతకం పెట్టటానికీ, జీతం పెరగటానికి ఉన్న సంబంధమేదో ఎంత ఆలోచించినా కుప్పుస్వామికి బోధపడలేదు. తనను చిన్నవాడిని చేసి వాళ్ళంతా ఏదో మోసం చేయాలని చూస్తున్నారనుకున్నాడు. సంతకం చేయటానికి సుతరామూ ఒప్పుకోలేదు.

"ఓరి పిరికి మొగమా, ఎందుకురా అంత భయపడి చస్తావూ? అంగరం కలిసి కావాలని కోరితే కంపెనీవాళ్ళు ఇవ్వకేమి చేస్తారురా ?" అన్నాడు రామస్వామి.

"ఏంచేస్తారా ? ఉద్యోగంలోనుండి ఊడబీకుతారు" అన్నాడు కుప్పుస్వామి అదే స్వరంలో.

"నీలాంటి పిరికినాయాల్లు ఉండబట్టే మన గతి యిట్లా ఏడుస్తుంది" అన్నాడు వడివేలు.

"ఎవర్నని తీసేస్తారురా ? అందర్నీ తీసేస్తే వాళ్ళ పని సాగొద్దూ ?" అన్నాడు నటరాజన్.

"ఇది ఇంగ్లీషులో రాసి పెట్టింది కూడా సుబ్బారావు బాబుగారే. తప్పయితే ఆయనెందుకు రాస్తాడురా ?" అన్నాడు రామస్వామి.

సుబ్బారావు బాబుగారే రాసి పెట్టారన్న ఆఖరి మాటలు కుప్పుస్వామి మీద పని చేసినయి. మారు మాట్లాడకుండా సంతకం చేశాడు కుప్పుస్వామి.

"సుబ్బారావు బాబుగారే రాసి పెట్టారు కాబట్టి అందులో తప్పేమీ ఉండదు. పైగా తప్పక జీతం పెరుగుదలా...డ్రెస్సులూ...అబ్బో! యీ రోజు బలే సంతోషంగా ఉందిలే" అనుకున్నాడు కుప్పుస్వామి.

పగలంతా బలే ఉత్సాహంగా పని చేశాడు. కుప్పుస్వామి సాయంత్రం ఆలోచించుకుంటూ ఇంటికి బయలుదేరిన కుప్పుస్వామికి అంత ఆనందంలోనూ తన గృహ పరిస్థితులు స్ఫురణకు వస్తూ కలవర పెట్టసాగాయి.

"యింటికి పోతూనే అమ్మకు చెప్పాలి. అమ్మ తనను అమాంతం కౌగిలించుకుని ముద్దుల వర్షం కురిపించదే!"

ఇలా ఆలోచించుకుంటూ యింటికి కొంత దూరంలో వుండగానే ఏవో కేకలు విన్పించాయి కుప్పుస్వామికి. తన యింటిచుట్టూ జనం మూగి వున్నారు. అతను ఒక్క పరుగులో యింట్లోకి దూకాడు

కళ్ళముందు అదే దృశ్యం. నాన్న అమ్మను జుట్టుపట్టుకుని వంచి వీపు మీద గుద్దుతున్నాడు. అమ్మ కేకపెడుతూ ఏడుస్తున్నది. పిల్లలు తలకోక చోట "గీబా" మంటున్నారు. చుట్టూచేరిన జనం వినోదాన్ని చూస్తున్నారు. కుప్పుస్వామి రక్తం తీవ్రంగా ప్రవహిస్తున్నది. మూలనున్న కర్రమీద దృష్టి పడింది. సత్తువకొద్దీ తండ్రి తలమీద కొట్టాడు. అతను పెద్ద మానులాగ 'అయ్యో!' అంటూ క్రిందపడ్డాడు.

ఇంతసేపటినుండి నాన్నను తిడుతూ ఏడుస్తున్న అమ్మ ఒక్కసారిగా 'అయ్యో నా దేముడా!' అంటూ నాన్నమీద విరుచుకుపడ్డది. గుంపులో నుండి ఎవరో ధర్మాత్ముడు ముందుకువచ్చి, దెబ్బకు కట్టుకట్టి ముఖంమీద నీళ్లు చల్లాడు. అతను కొంచెం తెప్పరిల్లి పక్కకు వత్తిగిలి పడుకున్నాడు. తల కొంచెం చిట్లింది, మరేమీ ప్రమాదంలేదని ఆమెను వోదార్చి ఒక్కొక్కరే జారుకున్నారు.

ఇంతసేపటినుండి ఒక మూల నిల్చొని భయంలో వణికిపోతున్న కుప్పుస్వామిమీద పడ్డది అతని తల్లి దృష్టి. ఆమె వళ్లు తెలియని కోపంతో కుప్పుస్వామిని చితుక కొట్టింది.

ఎంతో ఆనందంతో, పట్టలేని ఉత్సాహంతో వచ్చిన కుప్పుస్వామి బరువెక్కిన గుండెలతో కూలబడ్డాడు. ఎంతో ప్రొద్దుపోయేంతవరకూ ఏడ్చి ఏడ్చి నిద్రపోయాడు. రాత్రంతా పీడకలలు. ఆ రాత్రంతా ఆ యింట్లో ఎవరిని ఎవరూ ఓదార్చేవారు కాని, పూట్లాడేవారు కాని లేరు. తుఫాను తరువాత వుండే భయంకర నిస్తబ్ధత తాండవిస్తూంది—ఆ గుడిశలో.

ప్రొద్దుటే అమ్మ కుప్పుస్వామిని లేపింది. ఒళ్లు కాలిపోతున్నది. కళ్లు ఎర్రగా వున్నాయి. బిడ్డను చూస్తున్న ఆ మాతృహృదయం ఆక్రోశించింది. రాత్రి కొట్టినందుకు తనను తను ఎన్నో తిట్టుకున్నది.

కుప్పుస్వామి కళ్లు తెరుస్తూనే యింట్లోని ప్రశాంత వాతావరణాన్ని చూసి ఆనందించాడు. నాన్న, తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ రాత్రి అలాగే వుండి పోయిన అన్నం ఎంతో ఆప్యాయంగా తింటున్నారు.

తల్లిదండ్రు లిద్దరూ ఆరోజు కుప్పుస్వామిని కంపెనీకి వెళ్ళవద్దన్నారు. కాని కుప్పుస్వామి తప్పక వెళ్లాలని పట్టుపట్టాడు. తల్లిదండ్రులకు అయిదు రూపాయల జీతం పెరుగుదలను గురించీ, కాకీడ్రస్సును గురించీ చెప్పాడు. కాని అది ఎలా సంభవమో చెప్పలేదు. కంపెనీవాళ్లు జీతం పెంచారుకాబోలు ననుకున్నారు వాళ్లు. అలాంటప్పుడు పనికి పోకపోవటంకూడా అట్టే మంచిది కాదని కుప్పుస్వామికి ఏమీ అడ్డుచెప్పలేదు.

అన్నం తినకుండా అమ్మ యిచ్చిన రెండు అణాలలో ఒక అణా పునుగులు తిని, ఒక అణా టీ త్రాగి కంపెనీకి బయలుదేరాడు కుప్పుస్వామి. తల భారంగా వుంది, కళ్లు మండుతున్నాయి. వళ్లంతా నొప్పులు. ఎలాగో

కంపెనీ గేటు చేరుకున్నాడు. లోపలనుండి సుబ్బారావు విషాద వదనంతో బయటకు వెళుతున్నాడు. కుప్పుస్వామిని చూసీచూడకుండా వెళ్ళిపోయాడు. కుప్పుస్వామికి చాలా ఆశ్చర్యం కలిగింది.

కుప్పుస్వామి గేటులోపల ప్రవేశిస్తూనే, కంపెనీ బిల్డింగుకు చేరబడి ఏదో మాట్లాడుకుంటున్న రామస్వామిని, వడివేలును చూశాడు. అతని హృదయం ఏదో అజ్ఞాతభయంతో వణికిపోతున్నది. తనుకూడా భారంగా వాళ్ళదగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు.

"ఇప్పటికే అరగంట లేటయింది. యింకా యిక్కడే వున్నానేం?" అన్నాడు కుప్పుస్వామి.

"ఇంకా లేటేమిటి? యికనుండి మనకు పూర్తిగా శెలవే!"

"అంటే?"

"కంపెనీవాళ్ళకు మనం అలా రాయటంవల్ల కోపం వచ్చింది. అది 'డిశిప్లిన్'ను పాడుచేయటమంట. అందుకు మన ముగ్గుర్నీ తీసేశారు. మన మేగా టెంపరరీ వాళ్ళము" అన్నాడు రామస్వామి.

"పాపం! అన్యాయంగా ఆ సుబ్బారావు బాబుగారి ఉద్యోగంకూడ పోయింది. పిల్లలు కలవాడు. మరం ఏ కూలో—నాలో చేసుకు బతుకు తాను, పాపం! ఆ బాబు......"

కుప్పుస్వామి చెవులు దిబ్బెళ్ళు పడ్డాయి. కళ్ళు తిరుగుతున్నాయి. కాళ్ళు భూమిమీద ఆనటంలేదు. ఎక్కడికో అగాధంలోకి పడుతున్నట్లున్నది. వడివేలు మాటలు వినిపించటంలేదు.

"ఆఁ సుబ్బారావు బాబుగారి ఉద్యోగం పోయిందా?" అంటూ ముఖాన్ని చేతులతో కప్పుకుని గట్టిగా ఏడ్చాడు.

ఈనెల జీతం తీసుకెళ్ళమని రామస్వామి పిలుస్తున్నా వినిపించుకోకుండా కుప్పుస్వామి పిచ్చివానిలాగ బయటకు పరుగెత్తాడు.

చీకటి పడేంతవరకూ వూరంతా తిరిగాడు—మతిపోయిన వాడిలాగ. సంధ్యచీకట్లు కమ్ముకుంటున్నాయి. వర్షంవచ్చే సూచనలు పొడసూపటంవల్ల ప్రతివాళ్లూ, త్వరగా తమ గమ్యస్థానాన్ని చేరుకునే ప్రయత్నంలో వున్నారు. కాళ్ళీడ్చుకుంటూ, దిక్కు బిక్కుమంటూ ఇంటిముఖం పట్టాడు కుప్పుస్వామి.

వీధిమలుపు తిరగంగానే యింట్లోనుండి నాన్న కేకలూ, అమ్మ రోదనా, పిల్లల ఏడ్పులూ గింగురుమన్నాయి కుప్పుస్వామి చెవుల్లో. గుండెలు చెదిరి పోయినై అంతే. గిర్రున వెనక్కు తిరిగాడు. జ్వరతీవ్రతా, నరాల్లో పోటూ, తల దిమ్మూ. పాండీబజారు రోడ్డునే పడి పోతున్నాడు. లైట్లు కాంతుల్లో మెరిసిపోయే రకరకాల కోట్లూ, రంగురంగుల కార్లూ, కళ్లు చెదిరిపోయే చీరల్లో, సూట్లలో వున్న యువతీ-యువకులూ, రేడియోల మధురగానం — ఇదంతా చూస్తుంటే స్వర్గ మెక్కడో లేదనిపిస్తుంది. కాని కుప్పుస్వామిని యీ రోజు ఇవేమీ ఆకర్షించటం లేదు. బరువుగా నడుస్తున్నాడు. ఎక్కడకు ? ఎందుకు ? పాపం, వికలమైన ఆ పసివాని హృదయంలో ఆ ప్రశ్నలకు సమాధానం దొరకదు.

వానగాలీ పార్కు దగ్గరకు రాగానే—

"డెయ్, ముట్టాళ్! పండక్కు కుట్టించుకున్న కాకి డ్రస్సు ఏదిరా ? ఎదవముండ ! యీ భాగ్యానికే ఎంత షాన్ చేశావురా ?"

తంగవేలు మాటలు కుప్పుస్వామి చెవుల్లో నుండి దూసుకుపోయినాయి తంగవేలు తన వైపే వస్తున్నాడు బ్లూ లైట్ల కాంతిలో పండక్కు కుట్టించుకున్న కాకి లాగూ, తెల్ల చొక్కా మెరుస్తున్నాయి.

కుప్పుస్వామి గుండెలు కుములుతున్నాయి. అగ్ని పర్వతం భగ్గుమన్నది. తంగవేలు నుంచి పారిపోవాలి ?"

పార్కు గోడదూకి లోపల పడ్డాడు కుప్పుస్వామి. గుండెలు విచ్చి పోతున్నాయి. కాళ్లూ చేతులూ వణుకుతున్నాయి. నరాల్లో పోటు. చీకట్లో తడుముకుంటూ చెట్లచాటున ఉన్న ఓ బెంచీమీదకు పాకి పడుకున్నాడు.

తెల్లవారి పార్కులో స్పృహతప్పి పడివున్న కుప్పుస్వామి చుటూ జనం మూగారు.

"కాకి డ్రస్సు...ఐదు రూపాయలు..."

"పాపం! రాత్రంతా తడిసిపోయాడు. జ్వరంలో సంధి పుట్టింది" అన్నాడో కాయన.

"అవును ! సంధిలో పలవరిస్తున్నాడు" అన్నాడు యింకో కాయన.

(ఆంధ్రప్రభ వారపత్రిక - '53